క్లుప్తంగా

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ ప్రతాప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రామవరం టూటౌన్ పరిధిలో శనివారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. సీఐ ప్రతాప్ మాట్లాడుతూ... మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. సరైన ధృవీకరణ పత్రాలు వాహనదారుల వద్ద ఉండాలని తెలిపారు. సరైన పత్రాలు లేని వాహనాలను, నంబరు ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, పెండింగ్ చలాన్లను చెల్లించాలని చెప్పారు. హెడ్ కానిస్టేబుల్ బలరామరాజు, కానిస్టేబుళ్లు బుచ్చిరాములు, వెంకటేశ్వర్లు, వీరూ పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీ



షాపులో తనిఖీ చేస్తున్న శంభోశంకర్

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసాని, సత్యనారాయణపురం, ఉల్వనూరు గ్రామాల్లోని ఎరువులు, విత్తనాల దుకాణాలను శనివారం మండల వ్యవసాయశాఖాధికారి శంభోశంకర్ తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం నిషేధించిన బీటీ 3 పత్తి విత్తనాలను విక్రయించవద్దన్నారు. విత్తన కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు బిల్లులు ఇవ్వాలన్నారు.

ప్రధానమంత్రి మోదీతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న గాంధీనాయక్

కొత్తగూడెంఅర్బన్: దేశ ప్రధానమంత్రి మోదీతోనే అభివృద్ధి సాధ్యమని లక్ష్మీదేవిపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు మాలత్ గాంధీ నాయక్ అన్నారు. మోదీ పాలనలో అన్ని రాష్ట్రాలు అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉన్నాయని పేర్కొన్నారు. శనివారం లాలు తండా గ్రామంలో మండల కార్యశాల నిర్వహించారు. గాంధీ మాట్లాడుతూ... 11 ఏళ్ల మోదీ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గొడుగు శ్రీధర్, రెడ్డెం నవీన్‌కుమార్, మాలోత్ లక్ష్మణ్, చంద్రగిరి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: భారతీయ జనతా పార్టీ బలోపేతం కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పైడిపాటి రవీందర్ కోరారు. స్థానిక పట్టణంలో పట్టణ అధ్యక్షుడు రాపాక రమేష్ అధ్యక్షతన శనివారం పట్టణ, మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మొక్కలు నాటారు.

కఠినంగా శిక్షించాలి




ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న సావిత్రి

ఇల్లెందురూరల్: ఖమ్మం జిల్లా కల్లూరులో మహిళా ఎస్సైపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు యదళ్లపల్లి సావిత్రి డిమాండ్ చేశారు. ఇల్లెందులో శనివారం ఏర్పాటైన పీఓడబ్ల్యూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ముత్తమ్మ, సుజాత, హమాలి పాల్గొన్నారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): కల్లూరులో మహిళా ఎస్ఐ హరితపై దాడి చేసిన ఘటనను నిర్భయ ఆర్గనైజేషన్ ఫర్ ఉమెన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, న్యాయవాది మల్లెల ఉషారాణి శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. శుక్రవారం రాత్రి ఒక హోటల్ వద్ద జరిగిన గొడవను శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా అదుపు చేయడానికి వెళ్లిన మహిళా ఎస్ఐపై దాడి చేయడం గర్హనీయమని, దాడికి పాల్పడిని వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



జూలూరుపాడు: ఈద్ ముబారక్ చెప్పకుంటున్న చిన్నారులు

- ఈద్గాల వద్ద ప్రార్థనలు నిర్వహించిన ముస్లింలు
- ఈద్ ముబారక్ చెప్పిన రాజకీయ నాయకులు

ఇల్లెందు: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం పట్టణంలోని 13 మజీద్‌లలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాల వద్దకు చేరుకున్న పలువురు రాజకీయ నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, దిండిగాల రాజేందర్ ముస్లింలకు ఈద్ ముబారక్ చెప్పారు.

టేకులపల్లి: ముస్లింలు బక్రీద్‌ను శనివారం ఘనంగా జరుపుకున్నారు. టేకులపల్లి ఈద్గా, బేతంపూడి దర్గా వద్ద ముస్లింలు నమాజ్ చేశారు. మతపెద్దలు శాంతి సందేశం ఇచ్చారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు చెప్పకున్నారు.

పాల్వంచరూరల్: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కిన్నెరసానిలోని మజీద్‌లో శనివారం ప్రార్ధనలు చేశారు. అనంతరం బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

ఇందిరాకాలనీలో... ఈదుల్ అదా(బక్రీద్) సందర్భంగా శనివారం స్థానిక ఇందిరా కాలనీ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒడ్డుగూడెంలో మసీద్ ఉమర్ ఫరూక్ అహలే హదీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈద్ నమాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మసీద్ ఇమామ్ మహమ్మద్ యాకూబ్ మహాది మాట్లాడుతూ... బక్రీద్ పండుగ త్యాగానికి, సహనానికి, నైతికత, సోదరభావానికి ప్రతీక అన్నారు. ఇందిరా కాలనీ వద్ద వివిధ పార్టీల నాయకులు, సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

జూలూరుపాడు: త్యాగ నిరతికి ప్రతీకైన బక్రీద్ పర్వదినాన్ని శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని జూలూరుపాడు, పడమటనర్సాపురం గ్రామాల్లోని ఈద్గాల వద్ద పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రం జూలూరుపాడులోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. మత గురువు అతీశం ఇస్లాం పవిత్ర మత గ్రంథం ఖురాన్‌లోని ప్రవచనాలు చదివి వినిపించారు. బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు అలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. జూలూరుపాడు జమా మజీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ యాసిన్, కార్యదర్శి ఎస్కే బాబాజీ, ఎస్కే ఖాసీం, ఎస్కే కరీముల్లా, ఎస్కే సిద్ధిక్, బాబు, జానిమియా, మీరా, మస్తాన్, అక్బర్, బాజీ, సమీర్ తదితరులు పాల్గొన్నారు.



సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెంలోని బోడగుట్ట ఈద్గాలో..



పాల్వంచ: ఇందిరా కాలనీ వద్ద శుభాకాంక్షలు తెలుపుతున్న కొత్వాల శ్రీనివాసరావు



పాల్వంచ: ఒడ్డుగూడెం వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు



ఇల్లెందు: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



ఇల్లెందు: ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఇల్లెందు: శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకుడు దిండిగల రాజేందర్



జూలూరుపాడు: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పాల్వంచ: ఒడ్డుగూడెం వద్ద నమాజ్ చేస్తున్న ముస్లిం మహిళలు



పాల్వంచరూరల్: కిన్నెరసానిలో...



టేకులపల్లి: బేతంపూడి దర్గాలో శాంతి సందేశం ఇస్తున్న మతపెద్ద

నియోజకవర్గ అభివృద్ధిలో తగ్గేదే లేదు..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ: నియోజకవర్గ అభివృద్ధిలో ఎక్కడా వెనక్కి తగ్గేదే లేదని, అన్ని విధాల ప్రజలకు మేలు జరిగే విధంగా శాశ్వత పథకాలపై మరింత దృష్టి సారించనున్నట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రణాళిక బద్ధంగా అడుగులు వేస్తున్నామన్నారు. విద్యా, వైద్య రంగానికి రూ.223.42 కోట్ల నిధులు వెచ్చించామని, రూ.47.87 కోట్లకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. కొత్తగూడెం కార్పొరేషన్, ఎర్త్ యూనివర్సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు మంజూరులో ప్రధాన మైలురాళ్లు దాటాం అన్నారు. 800 మెగావాట్ల థర్మల్ కేంద్రం, మైలారం రాగి గనులు, ఎయిర్ పోర్ట్ ఏర్పాటు అయ్యే వరకు విశ్రమించేది లేదన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుతో పాల్వంచ, గిరిజన చట్టాలకు ఎలాంటి ముప్పు ఉండదని, దాని గుర్తింపును కాపాడే బాధ్యత తనదేనన్నారు. కొత్తగూడెం కేంద్రంగా ఈఎస్ఐ ఆస్పత్రి త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో పాల్వంచలోని సర్వే నంబర్ 444, 727, 817, 999 సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌కే సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, నిమ్మల రాంబాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగరపు శ్రీనివాస్‌రావు, నరహరి నాగేశ్వరరావు, మన్నెం వెంకన్న, శేఖర్, సత్యనారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా అమలు చేయండి..



ర్యాలీ నిర్వహిస్తున్న అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఇల్లెందు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అమలును విస్మరించిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాయిని రాజు ఆరోపించారు. శనివారం ఇల్లెందులో సంఘం ఆధ్వర్యంలో రైతు కూలీలతో ర్యాలీ నిర్వహించారు. రాజు మాట్లాడుతూ... వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి రూ.12 వేలు అందజేస్తామని హామీ ఇచ్చిందన్నారు. 18 నెలల కాలం గడిచినా ఊసే లేకుండా పోయిందన్నారు. ఇక ఉపాధి హామీ పథకంలో ఏడాదికి 20 రోజులు కూలికి వెళ్లి ఉండాలని షరతు పెట్టడం తగదన్నారు. రోజు కూలీ 180 నుంచి 230 వరకు కూడా రావడం లేదన్నారు. ఉపాధి హామీ పథకంలో అవినీతి పెరిగిపోయిందన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా అన్నిరకాల వైద్యం అందించాలని కోరారు. వ్యవసాయ కూలీలకు ప్రమాద బీమా వర్తింపజేయాలని కోరారు. బీడీ, గీత, చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేల పెన్షన్ అందించాలని కోరారు. కార్యక్రమంలో ఇస్లావత్ కోటేష్, సత్యం, రాంజీ, భద్రూ, పాషన్న, రాంబాబు, లక్ష్మయ్య, శ్రీను, సీతారాం, శాంతారావు, దేవా తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేషన్'పై ఎస్సీ కమిషన్‌లో ఫిర్యాదు

కొత్తగూడెంఅర్బన్: అసంపూర్తిగా, అసంబద్ధంగా కొత్తగూడెం కార్పొరేషన్ డివిజన్ల విభజన జరిగిందని, దానిపై సమగ్ర విచారణ నిర్వహించాలని నేషనల్ ఎస్సీ కమిషన్‌లో శనివారం ఫిర్యాదు చేసినట్లు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలు, సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయితీలను కలుపుతూ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 60 డివిజన్లుగా విభజించారు. వీటిని వెంటనే రద్దు చేయాలని బస్తీల ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీలు పాత పద్ధతిలోనే ఉండే విధంగా చూడాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు వివరించారు.

39వ డివిజన్‌ను రిజర్వేషన్ చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

సుజాతనగర్: కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 39వ డివిజన్‌కు ఎస్సీ రిజర్వేషన్ హోదా కల్పించాలని దళిత ఐక్య వేదిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ... హరిజనవాడ, సుందరయ్యనగర్, అంబేద్కర్‌నగర్, గొల్లగూడెం కోమటిపల్లి, నిమ్మలగూడెం ప్రాంతాలను 39వ డివిజన్‌లో కలిపారని, ఇందులో మొత్తం మాదిగ, మాల, బేడ, బుడగజంగాలలే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. ఎస్సీ రిజర్వ్‌డుగా అధికారిక ప్రకటన వచ్చే వరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేల్పుల భాస్కర్, సిరిగిరి మురళి, కత్తి బాలకృష్ణ, మంచాల శ్రీనివాస్, కత్తి వెంకన్న, కేసుపాక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: కార్పొరేషన్‌లో వార్డు విభజన అశాస్త్రీయంగా జరిగిందని టీడీపీ నాయకుడు కాపా కృష్ణమోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాభిప్రాయం లేకుండానే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నారని, దీనివల్ల సామాన్యులు ఇబ్బందులు పడతారిని, రాజకీయ లబ్ధి కోసమే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు.

సీపీఐ గ్రామశాఖ కమిటీ ఎన్నిక

పాల్వంచరూరల్: ఇల్లెందులపాడు తండా పంచాయతీలో శనివారం సీపీఐ గ్రామశాఖ నూతన కమిటీని నియమించినట్లు మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు తెలిపారు. కార్యదర్శిగా భూక్యా రమేష్, సహాయ కార్యదర్శి కొర్ర రూప్లా, మరో తొమ్మిది మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

పాస్టర్ల కమిటీ...

టేకులపల్లి: మండల పాస్టర్ల ఫెలోషిప్ నూతన మండల కమిటీ ఎన్నికైంది. ఈ మేరకు శనివారం బోడు కొత్తగూడెం పుష్పరాజ్ చర్చిలో సమావేశం నిర్వహించారు. పాత కమిటీని రద్దు చేశారు. మండల అధ్యక్షుడిగా జి.రాజు రామ్‌చందర్, ప్రధాన కార్యదర్శిగా తవుడోజు బోయాజ్, వైస్ ప్రెసిడెంట్‌గా ఉండం నరేష్, జాయింట్ సెక్రటరీగా ఎం.మార్క్, కోశాధికారిగా జి.తిమోతి, కార్యవర్గ సభ్యులుగా బి.అబ్రహం, సిస్టర్ కె.స్వతంత్ర , గౌరవ సలహాదారుడిగా ఎస్.దావీదులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పల్లెల్లో ఉత్సాహంగా బడిబాట



ఇల్లెందురూరల్: చెన్నంగులగడ్డ గ్రామంలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఇల్లెందురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల పెంపు లక్ష్యంగా విద్యాశాఖ చేపట్టిన బడిబాట కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలలో శనివారం ఉత్సాహంగా సాగింది. ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులతో కలిసి ప్రదర్శనలు నిర్వహించారు. మరికొన్ని గ్రామాలలో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాల ద్వారా ప్రభుత్వ పాఠశాల ప్రాధాన్యతను వివరించారు. గ్రామాలలో బడిబయట ఉన్న విద్యార్థుల వివరాలు కూడా సేకరిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.

టేకులపల్లి: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమలలో భాగంగా శనివారం టేకులపల్లి మండలంలో ఉపాధ్యాయులు కరపత్రాలతో పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. టేకులపల్లి, బోడు, కుంటల్ల, ముత్యాలంపాడు, సులానగర్, బొమ్మనపల్లి కాంప్లెక్స్‌ల పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, జీపీఎస్, ఆశ్రమ, గురుకుల, కేజీబీవీ, ఏకలవ్య మొత్తం 97 ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫ్లెక్సీలతో ర్యాలీ నిర్వహించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు అజ్మీర జగన్ నాయక్, మెరుగు శ్రీనివాస్, జోగ రవి, దేవదాసు, మంగీలాల్, రాంచందర్‌సింగ్, కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఐఈఆర్‌పీ టీచర్లు పాల్గొన్నారు.

రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో...

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక ప్రాంతమైన రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని 9వ వార్డు మాజీ కౌన్సిలర్ మోరే రూప ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, ఆట, పాటలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభుదయాళ్, ఉపాధ్యాయులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. జర పైలం

- ముందస్తు అప్రమత్తతే శ్రీరామరక్ష
- సీజనల్ వ్యాధులతో మరింత ప్రమాదం
- దోమల నివారణతో వ్యాధులకు దూరం



పారిశుద్ధ్య పనుల్లో పంచాయతీ కార్మికులు(ఫైల్)

చుంచుపల్లి: త్వరలో అసలైన వ్యాధుల సీజన్ మొదలు కానుంది. ఇప్పుడిప్పుడే చిరుజల్లులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఇక జోరు వర్షాకాలంలో దోమల దండయాత్రతో పాటు తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. దీంతో పాటు అనేక వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ముఖ్యంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, కామెర్లు, డయేరియా, మెదడువాపు లాంటి అనేక వ్యాధులు ఇబ్బందిపెడతాయి. ఇప్పటికే అక్కడక్కడ డెంగీ, మలేరియా జ్వరాలు కూడా ప్రబలుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. వచ్చేది వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా వ్యవహరించకపోతే వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది వర్షాకాలంలో వచ్చే వ్యాధుల సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని ముందస్తు జాగ్రత్య చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా బ్లీచింగ్, ఫాగింగ్ వంటి పారిశుద్ధ్య పనులపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దోమలతో వ్యాపించే వ్యాధులు ఇవే...

సీజనల్ వ్యాధుల్లో రెండు రకాలు ఉంటాయి. ఒకటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు. రెండు తాగునీరు కలుషితం కావడం వలన వచ్చే వ్యాధులు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల్లో డెంగీ, మలేరియా, మెదడువాపు, చికున్ గున్యా, బోదకాలు ముఖ్యమైనవి. తాగునీరు కలుషితం కావడం వలన టైఫాయిడ్, డయేరియా, కామెర్లు వంటి వ్యాధులు ప్రబలుతాయి.

డెంగీ జ్వరం.... ఇది ఎడిస్ ఈజిప్ట్ అనే దోమకాటు ద్వారా సోకుతుంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా తీవ్రమైన జ్వరం వస్తుంది. తలనొప్పి, కంటిలోపల కదలికలు దగ్గు, కండరాలు, కీళ్లనొప్పులు ఇబ్బంది పెడతాయి. నోరు ఎండిపోవడం, వాంతి వచ్చినట్లు ఉండడం చర్మంపై కందినట్లు ఎర్రటి మచ్చలు కనిపిస్తాయి. ఈ జ్వరంలో కొందరికి ప్లేట్ లెట్లు తగ్గిపోతాయి. ఆందోళన చెందకుండా వెంటనే వైద్య చికిత్స కోసం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలి. సొంత చికిత్స ప్రమాదకరం.

మలేరియా... అనాఫిలిస్ అనే ఆడదోమ వలన మలేరియా సోకుతుంది. జూలై నుంచి డిసెంబర్ వరకు ఎక్కువగా మలేరియా ప్రబలుతుంది. వర్షాకాలంలో నీటి నిల్వ ఉండే ప్రదేశాలలో ఈ దోమలు పెరుగుతాయి. దోమ కాటు వేసిన రెండు వారాల తరువాత చలి జ్వరం, తలనొప్పి వస్తుంది.

టైఫాయిడ్.... తాగునీరు, ఆహారం కలుషితం కావడం ద్వారా వస్తుంది. జ్వరం వస్తూ పోతుంది. ఆకలి తగ్గుతుంది. కొంతమందిలో వాంతులు అవుతాయి. మూడు రోజుల తరువాత రక్త పరీక్షలలో టైఫాయిడ్ పాజిటివ్ వస్తుంది. వైద్యశాలకు వెళ్లి వైద్య చికిత్స చేయించుకోవాలి.

హెపటైటిస్ (కామెర్లు)...

వర్షాకాలంలో ఎక్కువగా సోకే వ్యాధి పచ్చకామెర్లు. కలుషితమైన నీరు, ఆహారం, మద్యం అలవాటు ఉన్న వారిలో ఈ వ్యాధి కనిపిస్తుంది. శరీరంలోకి ప్రవేశించిన సూక్ష్మక్రిములు కాలేయంలోకి ప్రవేశించడంతో కామెర్ల వ్యాధి వస్తుంది. కామెర్లు సోకగానే కళ్లు పసుపు పచ్చగా మారతాయి. వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి తగిన వైద్య చికిత్సలు చేయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

డయేరియా.... వర్షాకాలంలో వచ్చే వ్యాధులలో ప్రధానమైనది విరేచనాలు. ఇది కూడా కలుషితమైన ఆహారం, నీరు వలన వస్తుంది. విరేచనాలతో పాటు వాంతులు కూడా అవుతాయి. శరీరంలోని నీరంతా పోవడం వలన మనిషి నీరసపడిపోతారు. ఒక్కోసారి డీ హైడ్రేషన్‌కు గురవుతారు. విరేచనాలు మొదలైన వెంటనే వీలైనంత త్వరగా సమీపంలోని వైద్యశాలకు వెళ్లాలి.

దోమల నిర్మూలనే లక్ష్యంగా చర్యలు...

దోమలు ప్రధానంగా మురుగు నిల్వ ఉన్నచోట గుడ్లు పెడతాయి. అవి లార్వాగా మారతాయి. ఇవి ఇంట్లోని కూలర్లు, వాడి పడేసిన కొబ్బరి బోండాలు, టైర్లు, రుబ్బురోళ్లు తదితర వాటిలో పెరుగుతాయి. ప్రతి 15 రోజులకోసారి మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటే మట్టితో పూడ్చాలి. వీలుకాని పక్షంలో పెద్ద పెద్ద కుంటల్లో ఆయిల్ బాల్స్ వేస్తారని వైద్య శాఖ అధికారులు తెలిపారు. డెంగీ, మలేరియా జ్వరాలు దోమల ద్వారా మాత్రమే సోకుతాయి. దోమలు పుట్ట కూడదు, కుట్టకూడదు అనే నినాదంతో ముందస్తు జాగ్రత చర్యలను సూచిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ప్రజలలో అవగాహన కల్పించాలి. దోమలను తరిమేసేందుకుగాను ప్రతీ పంచాయతీల్లో ఫాగింగ్ మిషన్లు ఉన్నాయి. వాటి పనితీరును పరిశీలించుకోవాలని అధికారులు ఆదేశాలిచ్చారు.

అప్రమత్తంగా ఉండాలి...



జ్వరం, వాంతులు, విరేచనాలు లాంటివి కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి వైద్య చికిత్స చేయించుకోవాలి. సొంత వైద్యం చేసుకోకుండా వైద్యుడిని సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకోవాలి. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– నేహా అంజ్రీన్, వైద్యాధికారి, పెనగడప

సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం



వర్షాకాలం నేపథ్యంలో పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశాం. సీజన్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, నిత్యం పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశాలిచ్చాం. గ్రామాల్లో రోజు విడిచి రోజు ఫాగింగ్ చేయాలని కార్యదర్శులు, సిబ్బందికి సూచించాం.

– సుభాషిణి, ఎంపీడీఓ, చుంచుపల్లి